

అదే నిరీక్షణ.. అదే గోస

యూరియా కోసం రైతుల ఇబ్బందులు అంతా ఇంతా కాదు.

వివరాలు 8లో ▸



నష్టం వివరాల సేకరణ

నష్టపోయిన పంటల వివరాలను వ్యవసాయ అధికారులు సేకరిస్తున్నారు.

వివరాలు 8లో ▸



అభ్యంతరాలు తెలపండి

ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే చెప్పాలని అధికారులు కోరారు.

వివరాలు 9లో ▸

కల చెదిరే.. కన్నీళ్లే మిగిలే



నేలమట్టమైన గుడిసెలో సామగ్రిని తీసుకుంటున్న మహిళ

సండే స్పెషల్

ధూప్‌సింగ్ తండా.. నాలుగు రోజులుగా బాహ్య ప్రపంచానికి దూరంగా ఉన్న గిరిజనులు. వరదతో విలవిల్లాడిన ముంపు బాధితులు.. ఆ పీడకల నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్నారు. శనివారం సాక్షి పలకరించగా.. వారిలో భయం ఇంకా కనిపించింది. సీన్ కట్ చేస్తే.. తెల్లవారితే వినాయక చవితి.. రాత్రి భోజనాలు చేసి నిద్రకు ఉపక్రమించారు. అర్ధరాత్రి మొదలైన చినుకులు కొద్దిసేపట్లోనే జడివానగా మారింది. తెల్లవారేలోగా గంగమ్మ వాగు పోటెత్తింది. వరద విజృంభించి తండాను చుట్టుముట్టింది. అనుకోని ఉపద్రవంతో ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని చెట్టుకొకరు.. పుట్టకొకరు పరుగులు తీశారు. కరెంట్ లేదు, తిండీ తిప్పలు లేవు.. వాన నీటితోనే కడుపు నింపుకున్నారు. ఆ నరకయాతనను గుర్తు చేసుకొని కన్నీటి పర్యంతం అవుతున్నారు.

– హవేళిఘణాపూర్/మెదక్‌అర్బన్/మెదక్‌జోన్/మెదక్‌మున్సిపాలిటీ/రామాయంపేట/చిన్నశంకరంపేట

ఇంకా వీడని భయం

- పండగ పూట ప్రళయ ఘంటికలు
- తిండీ తిప్పలు లేవు.. వాన నీళ్లే ప్రాణాధారం
- రెండు గంటల మృత్యుపోరాటం
- ఇప్పుడిప్పుడే కుదుటపడుతున్న ముంపు బాధితులు



బతుకుతామనుకోలేదు..

మంగళవారం రాత్రి నుంచి వర్షం ప్రారంభం అయింది. చాయ్ ఏ తాగి అందరం ఇంట్లో కూర్చున్నాం. బుధవారం ఉదయం ఒక్కసారిగా ఇంటిలోకి వరద వచ్చింది. బయటకు రాగానే ఎటూ వెళ్లలేని పరిస్థితి. నిచ్చెన ద్వారా అందరం ఇంటిపైకి ఎక్కాం. అప్పటికే వరద ఉధృతి పెరిగింది. భయం భయంగా గడిపాం. బతుకుతామని అనుకోలేదు.

– లచ్చా, ధూప్‌సింగ్ తండా

పిల్లలను ఎత్తుకొని ట్యాంక్ ఎక్కాను



ఉన్న ఫలంగా వరద ఇంట్లోకి రావడంతో సర్వం వదిలి నా ఇద్దరు పిల్లలు, అత్త, మామను తీసుకొని ఇంటి పక్కనే గల వాటర్ ట్యాంకు ఎక్కాను. పైకి ఎక్కాక మా కూతురు అమ్మా నా స్కూల్ బస్తా ఏది..? అని అడిగితే నా బిడ్డను పట్టుకొని ఏడ్చాను.

– సౌందర్య, ధూప్‌సింగ్ తండా



కొట్టుకుపోతుంటే కాపాడారు

బుధవారం ఉదయం చాయ్ తాగేందుకు తండాలోని చాయ్ కొట్టుకు వెళ్లాను. ఒక్కసారిగా వరద రావడంతో పిల్లలు ఏమయ్యారనే ఆత్రుతతో ఇంటికి పరుగు పెట్టాను. వరద తాకిడికి కొట్టుకుపోతుండగా చాయికొట్టులో ఉన్న ముగ్గురు యువకులు వచ్చి కాపాడారు.

– లాల్యా, ధూప్‌సింగ్ తండా

క్షణమొక యుగం..

పోటెత్తిన వరదలు తండా వాసులకు నష్టాన్ని మిగిల్చాయి. మూడు రోజుల పాటు మిద్దెలెక్కి.. రాత్రింబవళ్లు క్షణమొక యుగంలా గడిపారు. వాన నీళ్లు తాగుతూ ప్రాణాలు దక్కించుకున్నారు. వానకు తడుస్తూ వణికే చలిలో వృద్ధులు, చిన్న పిల్లలను కాపాడుకోవడానికి వారు పడిన అవస్థలు వర్ణనాతీతం. కానీ ఇంటికి వచ్చే సరికి ఎవుసంలో తోడుండే మూగ జీవాలు జల ప్రవాహానికి బల య్యాయి. నిత్యావసర సామగ్రి బురదలో కూరుకుపోయాయి. తిండి గింజలు నీటి పాలయ్యాయి. పంటలు పాడైపోయాయి. కరెంట్ లేక బయట వారితో మాట్లాడేందుకు ఫోన్లు లేక, చిమ్మ చీకట్లో పాములు, తేళ్ల భయంతో గడిపిన, నరక క్షణాలు తమకు కాళరాత్రులు మిగిల్చాయని వాపోయారు.



వరదలో తడిచిన బియ్యాన్ని చూపుతున్న మహిళ

ఇప్పుడిప్పుడే వర్షబాధిత ప్రాంతాలైన ధూప్‌సింగ్ తండా, రాజ్‌పేట, రామాయంపేట, సదాశివనగర్, మెదక్ పట్టణం, పాపన్నపేటలోని రాజ్యాతండాలు, చిన్నశంకరపేటలోని కొన్ని ప్రాంతాలు తేరుకుంటున్నాయి. సహాయక చర్యలు అందుతున్నాయి. మెల్లమెల్లగా బాధితులు సహాయక శిబిరాల నుంచి ఇళ్లకు చేరుకుంటున్నారు. కానీ చేతికొచ్చిన పంట నీటి పాలై, పొలాల్లో ఇసుక మేటలు దర్శనమిస్తున్నాయి. బురదమయమైన ఇల్లు, నీటి పాలైన నిత్యావసర వస్తువులు, చెదిరిన గూడు చూసి కన్నీళ్లు పెట్టుకుంటున్నారు. వినాయక చవితి రోజున వరదలు మిగిల్చిన చేదు జ్ఞాపకాలు బాధితులను వెంటాడుతున్నాయి.



ఇంట్లో పేరుకుపోయిన బురదను చూపుతున్న మహిళ



ఆదుకోవాలని వేడుకుంటున్న ధూప్‌సింగ్ తండా వాసులు

జలదిగ్బంధంలో తండాలు, కాలనీలు

రామాయంపేట మండలంలో కేవలం 6 గంటల వ్యవధిలో 20 సెం.మీ. వర్షం కురిసింది. సదాశివనగర్ తండా నాలుగు రోజులుగా జలదిగ్బంధంలోనే చిక్కుకుంది. అటవీ ప్రాంతంలో ఉన్న తండాకు ఇతర ప్రాంతాలతో సంబంధాలు తెగిపోయాయి. తండాలో ఇద్దరు గర్భిణులు ఉన్నట్లు సమాచారం. రామాయంపేటలోని అక్కల బస్తీ, శ్రీనగర్‌కాలనీ వరద నీటిలో చిక్కుకున్నాయి. ఇళ్లలోకి నీరు చేరి బుర దమయంగా మారాయి. తిండి గింజలు తడిసి పోయాయి. పాపన్నపేట మండలం రాజ్యా, కశ్యా, రుగ్యా, జైరాం, పోంలా తండాల మధ్య ఉన్న కుంట కట్టకు గండి పెట్టడంతో, బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. పలు చోట్ల ఇళ్లుకూలి పోయాయి. పంటలు నీట మునిగాయి. చిన్నశంకరంపేట మండలం నార్సింగి నుంచి శేరిపల్లి వరకు గన్నేరు కుంట పొంగి పొర్లడంతో పంటలు నాశనమయ్యాయి. నార్సింగి వద్ద జాతీయ రహదారి ధ్వంసమైంది. టి.మందాపూర్ వాసులను వరద భయంతో పండగ పూట సహాయక శిబిరంలో ఉంచారు. మెదక్ పట్టణంలోని గాంధీనగర్‌లో ఇళ్లలోకి నీళ్లు వచ్చాయి. పోచారం ప్రాజెక్టుకు ప్రమాదం పొంచి ఉందనే భయంతో అధికారులు సర్దన గ్రామస్తులను మెదక్‌లోని సహాయక శిబిరాలకు తరలించారు.



ఇంకా ముంపులోనే రామాయంపేట శ్రీనగర్ కాలనీ

బిడ్డలను తీసుకొచ్చేందుకు వెళ్లి..



రోదిస్తున్న యాదాగౌడ్ కుటుంబీకులు

రాజ్‌పేటకు చెందిన బెస్త సత్యనారాయణ, దామరంచ యాదాగౌడ్ ప్రాణ స్నేహితులు. హాస్టల్‌లో ఉంటున్న తమ బిడ్డలను వినాయక చవితికి ఇంటికి తీసుకొచ్చేందుకు మెదక్ బయల్దేరారు. మార్గమధ్యలో వరద ముంచెత్తడంతో చిక్కుకున్నారు. కొద్దిసేపు ఆటోను అడ్డం పెట్టుకొని జీవన పోరాటం చేశారు. వరద ఉధృతికి అది కాస్తా కొట్టుకుపోగా, పక్కనే ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఆసరాగా చేసుకొని, కుటుంబీకులకు సమాచారం అందించారు. విషయం తెలుసుకున్న అధికారులు, ప్రజాప్రతినిధులు హెలిక్యాప్టర్ కోసం ప్రయత్నాలు చేశారు. కానీ వాతావారణ అనుకూలించకపోవడంతో సాధ్యం కాలేదు. చివరి క్షణం వరకు ప్రయత్నించిన స్నేహితులు చివరకు, అందరి కళ్లేదుటే ఒక్కసారిగా నీటిలో కొట్టుకుపోయారు.

న్యూస్‌రీల్

అప్రమత్తంగా ఉండాలి

మెదక్ కలెక్టరేట్: మంజీరా నదికి వరద పోటెత్తనుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహారాష్ట్రలోని లాతూర్ కర్ణాటకలోని సాయిగాం నుంచి లక్ష క్యూసెక్కుల నీరు వదిలారని తెలిపారు. ఎవరూ చేపల వేటకు వెళ్లవద్దని సూచించారు.

నిధులు మంజూరు చేయండి



ఆర్‌అండ్‌బీ ముఖ్య అధికారి వికాస్‌రాజ్‌కు వినతిపత్రం అందజేస్తున్న శశిధర్‌రెడ్డి

పాపన్నపేట(మెదక్): మెదక్- బొడ్మట్‌పల్లి రోడ్డుపై అనంతుని వాగు బ్రిడ్జికి ఇరువైపులా శిథిలమైన రోడ్డు మరమ్మతులకు నిధులు మంజూరు చేయాలని మెదక్ మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి కోరారు. ఈమేరకు ఆర్‌అండ్‌బీ ముఖ్య అధికారి వికాస్‌రాజ్‌కు శనివారం వినతిపత్రం అందజేశారు. పాపన్నపేట మండలం కొత్తపల్లి వద్ద ఉన్న ఈ బ్రిడ్జికి ఇరువైపులా రోడ్డు పూర్తిగా ధ్వంసం అయిందని వివరించారు. ఈ రోడ్డు గుండా నిత్యం 500 వాహనాలు తిరుగుతాయని చెప్పారు.

ఎన్నికలప్పుడే గుర్తొస్తరా.?



గిరిజనులకు నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న నాయకులు

హవేళిఘణాపూర్(మెదక్): ఎన్నికలప్పుడు తండాల చుట్టూ తిరిగి ఓట్లడిగే రాజకీయ నాయకులు ధూప్‌సింగ్ తండా ప్రజలను పట్టించుకోలేదని గిరిజన సంక్షేమ శాఖ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు జైపాల్‌నాయక్ అన్నారు. శనివారం తండాను పరిశీలించి గిరిజనుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నిత్యావసర సరుకులు అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులుగా విద్యుత్, తాగునీరు, ఆహారం లేక అల్లాడుతుంటే ఏ అధికారి, ప్రజాప్రతినిధి గానీ పట్టించుకోలేదని మండిపడ్డారు. వెంటనే తండాకు విద్యుత్ సరఫరా పునరుద్ధరించి రవాణా సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గోపాల్‌నాయక్, శినాయక్, కిషన్, రమేశ్, రంజిత్, బాబు, స్వామినాయక్, కుమార్, శేఖర్, రఘు పాల్గొన్నారు.

దెబ్బతిన్న పంటల పరిశీలన



ఎల్లాపూర్‌లో నీట మునిగిన పంటలను పరిశీలిస్తున్న అధికారులు

పాపన్నపేట(మెదక్): మండలంలోని ఆరెపల్లి, ఎల్లాపూర్ గ్రామాల్లో ముంపునకు గురైన పంటలను ఏడీఏ విజయనిర్మల, వ్యవసాయాధికారి నాగమాధురి శనివారం పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలతో మంజీరా తీరంలోని పలు ప్రాంతాల్లో పంటలు మునిగాయని తెలిపారు. తమ సిబ్బందితో కలసి ఆయా గ్రామాల్లో నష్టపోయిన పంటల వివరాలు సేకరిస్తున్నట్లు చెప్పారు. నీరు నిల్వ ఉన్న పొలాల్లో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి, ఏఈఓలు జనార్దన్, అభిలాష్, ఆసిఫ్, రైతులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనులు చేపట్టాలి



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న జెడ్పీ సీఈఓ ఎల్లయ్య

తూప్రాన్: మండల పరిషత్ కార్యాలయంలో ఆయా శాఖల అధికారులతో జెడ్పీ సీఈఓ ఎల్లయ్య శనివారం సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాలతో దెబ్బతిన్న రోడ్లు, ఇండ్లు, విద్యుత్ తీగలు వంటి వాటికి సకాలంలో స్పందించి సహాయ సహకారాలు అందించినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు సక్రమంగా నిర్వహించే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సమీకృత భవనాన్ని పరిశీలించారు. సమావేశంలో ఆర్టీఏ జయచంద్రా రెడ్డి, పాల్గొన్నారు.

ట్రయల్ రన్ సక్సెస్.. రైళ్లు షురూ



సికింద్రాబాద్- నిజామాబాద్ మధ్య నడిచిన ప్రత్యేక రైలు

చిన్నశంకరంపేట(మెదక్)/రామాయంపేట: భారీ వర్షాలతో కామారెడ్డి జిల్లా పరిధిలో ట్రాక్ దెబ్బతినడంతో సికింద్రాబాద్- నిజామాబాద్ మార్గంలో గత మూడు రోజులుగా రద్దయిన రైళ్లు శనివారం ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం గూడ్స్ రైలును ట్రయల్ రన్ చేశారు. అనంతరం ప్యాసింజర్ ప్రత్యేక రైలును నడిపారు. ఈ రైలుకు మెదక్ జిల్లాలోని మనోహరాబాద్, వడియారం, అక్కన్నపేటలో హాల్టింగ్ ఇచ్చారు. ఇది క్షేమంగా నిజామాబాద్ చేరుకోవడంతో మరిన్ని ఎక్స్‌ప్రెస్ రైళ్లను నడిపారు. విశాఖ, సంబల్‌పూర్ రైళ్లు మధ్యాహ్నం వరకు నిజామాబాద్ వైపు వెళ్లాయి. అలాగే కాచిగూడ- బోధన్, కాచిగూడ- నిజామాబాద్, కాచిగూడ- పూర్ణ రైళ్లు నడవనున్నాయి. ఈ మూడు రైళ్లను నిజామాబాద్ వరకు నడపనున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. కాగా మెదక్ వైపు వెళ్లే ట్రాక్‌కు ఇంకా మరమ్మతులు చేపట్టకపోవడంతో ఈమార్గంలో నడిచే రైళ్లు ప్రారంభం కాలేదు.

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే తిప్పలు

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి



తండా వాసులతో మాట్లాడుతున్న పద్మారెడ్డి

హవేళిఘణాపూర్(మెదక్): బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రూ. 3 కోట్లు మంజూరు చేసి రూ. 80 లక్షలతో 40 శాతం పూర్తి చేసిన పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్‌ఓసీ ఇవ్వకపోవడంతో పనులు జరుగక తండా వాసులు ఇబ్బంది పడ్డారని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు పద్మారెడ్డి ఆరోపించారు. శనివారం మండల పరిధిలోని ధూప్‌సింగ్ తండాను పరిశీలించారు. తండావాసుల ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వాలు మారినా ప్రజ ల ఇబ్బందులు తీర్చాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులపై ఉంటుందన్నారు. చేసిన పనులకు కాంట్రాక్టర్‌కు ఎన్‌ఓసీ ఇవ్వడంలో తాత్సారం చేయడం వల్లే ఈ దయనీయ పరిస్థితి ఏర్పడిందన్నారు. బ్రిడ్జి పనులు పూర్తి చేయకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని వాపోయారు. అలాగే పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఆమె వెంట లావణ్యరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ యామిరెడ్డి, మేకల సాయిలు, చెన్నాగౌడ్, సిద్ధిరాంరెడ్డి, భిక్షపతి, సతీశ్‌రావు, బాల్‌రాజ్, రాంచంద్రారెడ్డి, రవీందర్‌గౌడ్, సాప సాయిలు, శ్రీనునాయక్, రంజిత్, తరుణ్ ఉన్నారు.

జాగ్రత్తలు తప్పనిసరి: ఎస్పీ

మెదక్ మున్సిపాలిటీ: జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పలు వినాయక మండపాలను ఎస్పీ డీవీ శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిమజ్జనం, ఉత్సవాల సందర్భంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భద్రతా చర్యలపై వారికి సూచనలు అందించారు. ప్రజలు శాంతి, సోదరభావంతో పండుగలు జరుపుకోవాలని, పోలీస్‌శాఖ అన్నివిధాల సహకారం అందిస్తుందని తెలిపారు. అంతకుముందు మెదక్ మండలం కొంటూర్ చెరువులో నిమజ్జన ఏర్పాట్లను కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి పరిశీలించారు. ఆయన వెంట డీఎస్పీ ప్రసన్నకుమార్, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి, రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.



వినాయక మండపం వద్ద ఎస్పీ శ్రీనివాసరావు

పనిచేయని వారిని ఇంటికి పంపండి

అధికారుల పనితీరుపై కలెక్టర్ ఆగ్రహం

మెదక్ కలెక్టరేట్: పనిచేయని వారికి మెమోలు జారీ చేసి ఇంటికి పంపించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ డీఆర్‌ఓ భుజంగరావును ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని అవుట్, ఇన్‌వార్డ్ సెక్షన్, ఖజానా శాఖ, ఎస్‌ఐసీ కార్యాలయాలను తనిఖీ చేసి హాజరు పట్టికను పరిశీలించారు. ఉదయం 11:30 అవుతున్నా కొంతమంది సిబ్బంది విధులకు రాలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమయానికి రాని వారిపై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. విధుల్లో ఉండాల్సిన ఎస్‌ఐసీ ఉద్యోగి సమాచారం ఇవ్వకుండా సెలవుపై వెళ్లడంపై అసహనం వ్యక్తం చేశారు. మెమో జారీ చేయాలని ఆదేశించారు. జిల్లాలోని అన్నిశాఖల అధికారులు వరద సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నందున సోమవారం హెల్ప్‌డెస్క్ ద్వారా ప్రజావాణి ఉంటుందని కలెక్టర్ చెప్పారు. అలాగే వరదలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నందున ఆదివారం అన్నిశాఖల అధికారుల సెలవు రద్దు చేసినట్లు తెలిపారు. వరద ప్రాంతాల్లో పర్యటించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం రానున్న స్థానిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని ఆయా పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు.



హాజరు రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

పంట నష్టం వివరాలు సేకరిస్తున్నాం

హవేళిఘణాపూర్(మెదక్): అధికారులు పంట నష్టం వివరాలు సేకరిస్తున్నారని కలెక్టర్ రాహుల్‌రాజ్ తెలిపారు. శనివారం భారీ వర్షాలతో కొట్టుకుపోయిన రోడ్లు, నష్టపోయిన పంట పొలాలను పరిశీలించారు. మండల పరిధిలోని రాజ్‌పేట నుంచి కప్రాయిపల్లి బ్రిడ్జిని పరిశీలించేందుకు బైక్‌పై వెళ్లారు. త్వరలోనే తాత్కాలిక మరమ్మతులు చేసి గ్రామస్తులకు రవాణా సదుపాయం కల్పిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం దూప్‌సింగ్ తండా, బ్రిడ్జిని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. నిమజ్జనం చేసే కొంటూర్ చెరువు వద్ద ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులు ఆదేశించారు.

అంధకారంలో పీహెచ్‌సీ



చిమ్మచీకట్లో మనోహరాబాద్ పీహెచ్‌సీ

మనోహరాబాద్(తూప్రాన్): ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి మూడు రోజులుగా విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. భారీ వర్షాలకు పీహెచ్‌సీ ప్రాంగణంలోకి వరద నీరు చేరింది. దీంతో విద్యుత్ ప్రసారం అందించే కేబుల్ సమస్యతో విద్యుత్ సరఫరా కావడం లేదని సిబ్బంది చెబుతున్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం రాష్ట్ర వైద్యారోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ డైరెక్టర్ రవీందర్‌నాయక్ పీహెచ్‌సీని సందర్శించి రికార్డులు పరిశీలించారు. చికిత్స పొందుతున్న వారితో మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాగా విద్యుత్ అంతరాయం గురించి వైద్యులు ఆయన దృష్టికి తీసుకెళ్లలేదు. మూడు రోజులుగా విద్యుత్ లేకున్నా పట్టించుకోకపోవడంపై రోగులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

ఏమనాలా..!

- నాలాలపై అక్రమ నిర్మాణాలు
- భారీ వర్షంతో తీవ్ర నష్టాలు
- మంత్రి ఆదేశించినా పట్టని అధికారులు



రామాయంపేటలో నాలాకు అడ్డంగా నిర్మించిన గది



నాలాకు అడ్డంగా పిల్లర్లు వేసి స్లాబ్ వేసిన దృశ్యం

రామాయంపేట(మెదక్): భారీ వర్షం కురిస్తే చాలు పట్టణ ప్రజలు వణికిపోతున్నారు. పలు కాలనీల్లో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. మున్సిపాలిటీ పరిధిలో కొందరు నాలాలపై అక్రమ నిర్మాణాలు చేపట్టడంతో వరద నీరు ఇళ్లు, దుకాణాల్లోకి చేరి అవస్థలు పడుతున్నారు. తీవ్ర నష్టాన్ని చవిచూస్తున్నారు. అక్రమ నిర్మాణాలతో వరద పలు కాలనీల్లో సెల్లార్లు, ఇళ్లలోకి ప్రవేశిస్తోంది. అటవీ ప్రాంతంతో పాటు ఎత్తయిన గుట్టలపై కురిసిన వర్షం నీరు నాలా ద్వారా మల్లె చెరువుతో పాటు ఇతర చెరువుల్లో కలిసేది. ప్రధాన నాలాకు అడ్డంగా ఏకంగా కొందరు అక్రమ నిర్మాణాలు చేపట్టగా, రెండు, మూడు రోజుల క్రితం భారీస్థాయిలో కురిసిన వర్షంతో వరద నీరు సాఫీగా వెళ్లకుండా దారి మళ్లి ఇళ్లు, దుకాణాల్లోకి చేరింది. దీంతో నాలా పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్, దుకాణాలు, హోటళ్ల నిర్వాహకులకు తీవ్ర నష్టం వాటిల్లింది. దుకాణాలు, టెంట్ హౌస్‌లోని సామగ్రి, ఇతర వస్తువులు నీటిలో కొట్టుకుపోయాయి. వరద నీరు రెండు రోజుల పాటు ప్రధాన రహదారిపై పారి రాకపోకలు స్తంభించాయి. గతంలో కొందరు నాలాపై అక్రమంగా పిల్లర్లు వేసి స్లాబ్ పోయగా, మరి కొందరు కాలువకు అడ్డంగా గది నిర్మించారు. కొందరు ప్రజాప్రతినిధులతో పాటు అధికారులు సైతం వారికి పరోక్షంగా సహకరించినట్లు ఆరోపణలున్నాయి. ఈవిషయమై స్థానికులు పలుమార్లు కలెక్టర్, ఇతర అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని తెలిసింది. ఇటీవల వైద్యారోగ్యశాఖ మంత్రి దామోదర రాజానర్సింహ నాలాపై అక్రమ నిర్మాణాలను గమనించి అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే అక్రమ నిర్మాణాలు తొలగించాలని ఆదేశించారు. కాగా మున్సిపల్ అధికారులు ఇంకా నాలాలపై అక్రమ నిర్మాణాలు పూర్తిస్థాయిలో తొలగించలేదు. మంత్రి ఆదేశాలను బేఖా తరు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

క్లుప్తంగా

మీ సేవలు భేష్: కలెక్టర్ హైమావతి


దామోదర్‌రావు దంపతులను సన్మానిస్తున్న కలెక్టర్


మిషన్‌భగీరథ ఈఈని సన్మానిస్తున్న కలెక్టర్

సిద్దిపేటరూరల్: జిల్లాను గౌరవప్రదమైన స్థానంలో నిలపడంలో హౌసింగ్ పీడీ దామోదర్‌రావు, మిషన్ భగీరథ ఈఈ గిరిధర్ అందించిన సేవలు అమోఘమని కలెక్టర్ కె. హైమావతి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో దామోదర్‌రావు, గిరిధర్‌ల పదవీ విరమణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ తాను మొదటగా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం మొదలైందని, దీనిపై ఎప్పటికప్పుడు పీడీతో చర్చించి ముందుకెళ్లామన్నారు. మిషన్ భగీరథ సైతం రోజువారీగా ప్రజలకు నీరందించడం అభినందనీయమన్నారు. ఇరువురి శేష జీవితం బాగా ఆనందంగా, ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. మిషన్ భగీరథ ఈఈ గిరిధర్ మాట్లాడుతూ నీటి సరఫరా చేయడంలో అధికారులు బాగా సహకరించారన్నారు. హౌసింగ్ పీడీ.దామోదర్‌రావు మాట్లాడుతూ ఇందిరమ్మ ఇళ్ల కార్యక్రమం సక్సెస్ చేయడానికి రాత్రివేళల్లో సైతం విధులు నిర్వహించినట్లు తెలిపారు.

కొమురవెల్లి నూతన ఈవోగా అంజనీదేవి

కొమురవెల్లి(సిద్దిపేట): కొమురవెల్లి మల్లికార్జున స్వామి ఆలయ నూతన ఈవోగా కె.అంజనీదేవిని నియమిస్తూ దేవాదాయశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. దేవాదాయ శాఖ కార్యాలయంలో జ్యువెలరీ వెరిఫికేషన్ అధికారిగా (అసిస్టెంట్ కమిషనర్)గా విధులు నిర్వహిస్తున్న అంజనీదేవికి ఆలయ ఈవోగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం ఇక్కడ ఈవోగా పని చేస్తున్న అన్నపూర్ణ నేటితో పదవీ విరమణ పొందుతున్నారు. సోమవారం నూతన ఈవో బాధ్యతలు చేపట్టనున్నట్లు సమాచారం.

పోలీస్ స్టేషన్ తనిఖీ

సదాశివపేట(సంగారెడ్డి): పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఎస్పీ పరితోష్ పంకజ్ శనివారం తనిఖీ చేశారు. ఈ సదర్భంగా పోలీసుల పనితీరు, స్టేషన్ పరిసరాలను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు. శాంతి భద్రతల పరిరక్షణ, మహిళా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వినాయక నిమజ్జనంలో తీసుకోవాల్సిన భద్రత చర్యల గురించి సిబ్బందికి సూచనలు చేశారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ ఫిర్యాదు దారులతో స్నేహంగా వ్యవహరించి బాధితులకు సత్వర న్యాయం జరిగేలా పనిచేయాలని ఆదేశించారు.

నాటు సారా స్వాధీనం

నారాయణఖేడ్: నాటు సారాను తయారు చేస్తున్న వ్యక్తిని పట్టుకొని, 16.75లీటర్ల సారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎక్సైజ్ డిస్ట్రిక్ టాస్క్‌ఫోర్స్ టీం ఎస్‌ఐ హనుమంతు, అనుదీప్ వివరాల ప్రకారం... ఖేడ్ మండలం శేరి తండాలో కేతావత్ హిరామన్ ఇంట్లో అక్రమంగా నాటుసారా తయారు చేస్తున్నాడు. విశ్వసనీయ సమాచారం మేరకు శనివారం దాడులు చేసి సారాయిని స్వాధీనం చేసుకుని, బట్టిని ధ్వసం చేశారు. నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. ఎక్సైజ్ డీసీ హరికిషన్ ఆదేశాల మేరకు దాడులు చేసినట్లు తెలిపారు. సిబ్బంది అంజిరెడ్డి, అరుణ్‌జ్యోతి, రాజేశ్ ఉన్నారు.

ఆర్‌ఎంపీ వైద్యుడిపై కేసు

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లిలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి నిర్వాహకుడు (ఆర్‌ఎంపీ) వైద్యుడు సుదర్శన్‌పై కేసు నమోదైంది. ఎస్సై శ్రీనివాస్ వివరాల ప్రకారం... గ్రామంలో క్లినిక్ పేరిట యథేచ్ఛగా ఆస్పత్రి పేరు పెట్టుకొని ప్రాథమిక వైద్య చికిత్సలకు బదులుగా అత్యవసర వైద్యం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలోనే జగదేవ్‌పూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన విద్యార్థి యశ్వంత్ డెంగీ వ్యాధి లక్షణాలతో ఆస్పత్రికి వచ్చాడు. ప్రాథమిక చికిత్స అందించి ప్రభుత్వ ఆస్పత్రికి రెఫర్ చేయాలి. కానీ ఆర్‌ఎంపీ వైద్యుడు సుదర్శన్ అనుభవ రాహిత్యంతో అత్యవసర వైద్యం చేయడంతో విద్యార్థి మృతి చెందినట్లు కుటుంబీకులు డీఎంహెచ్ఓ ధన్‌రాజ్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలోనే డిప్యూటీ డీఎంహెచ్ఓ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు పేర్కొన్నారు.

అదే నిరీక్షణ.. అదే గోస

యూరియా కోసం రైతుల పాట్లు

తెల్లవారు జామునుంచే క్యూలైన్లు ● తూప్రాన్– నర్సాపూర్ హైవేపై రాస్తారోకో

యూరియా కోసం రైతుల ఇబ్బందులు అంతాఇంతా కాదు. శనివారం మెదక్ జిల్లా వ్యాప్తంగా తెల్లవారు జామునుంచే యూరియా కోసం ఆగ్రోస్ రైతు సేవా కేంద్రాలు, రైతు వేదికలు, పీఏసీఎస్ సొసైటీలు, ఎరువుల కేంద్రాల వద్ద బారులు తీరారు. కొన్ని చోట్ల రైతులకు సరిపడా యూరియా రాక వెనుదిరిగారు. కొన్ని ప్రాంతాల్లో వ్యవసాయ అధికారులతో రైతులు గొడవకు దిగారు. దీంతో పోలీసులు నచ్చజెప్పి ఆధార్‌కార్డుల ఆధారంగా పంపిణీ చేశారు. శివ్వంపేటలో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురు చూసినా యూరియా రాకపోవడంతో రైతులు బస్టాండు సమీపంలోని తూప్రాన్– నర్సాపూర్ హైవేపై బైఠాయించి రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.

– మెదక్ జిల్లా బృందం


రామాయంపేట(మెదక్): రామాయంపేటలో యూరియా కోసం బారులు తీరిన అన్నదాతలు


చేగుంట(తూప్రాన్): చేగుంట రైతు వేదిక వద్ద టోకెన్ల కోసం చెప్పులు, గొడుగులు క్యూలైన్‌లో ఉంచిన దృశ్యం


నిజాంపేట(మెదక్): చల్మెడలో యూరియా కోసం ఎదురు చూస్తున్న రైతులు


నర్సాపూర్: నర్సాపూర్‌లో పీఏసీఎస్ వద్ద యూరియా కోసం నిరీక్షణ


వెల్దుర్తి(తూప్రాన్): వెల్దుర్తిలో బారులు


శివ్వంపేట(నర్సాపూర్): శివ్వంపేటలో రాస్తారోకో చేస్తున్న రైతులు


చిన్నశంకరంపేట(మెదక్): చిన్నశంకరంపేటలో క్యూలైన్‌లో నిలుచున్న రెతులు



కాడిపల్లి(నర్సాపూర్): యూరియా కోసం వచ్చిన రైతులకు నచ్చజెబుతున్న ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి

పంట నష్టం వివరాల సేకరణ

పెద్దశంకరంపేట(మెదక్): ఇటీవల కురిసిన వర్షాలకు నష్టపోయిన పంటల వివరాలను వ్యవసాయ అధికారులు సేకరిస్తున్నారు. శనివారం మండల పరిధిలోని కమలాపూర్, టెంకటి, బుజ్రాన్‌పల్లి తదితర గ్రామాల్లో ఏఓ కృష్ణ పర్యటించారు. వివరాలు సేకరించి ఉన్నతాధికారులకు నివేదిస్తామని తెలిపారు. పరిశీలించిన వారిలో ఏఈఓలు అఖిల్, వినీత్, పీఏసీఎస్ డైరెక్టర్ సత్యం తదితరులున్నారు.


పెద్దశంకరంపేట : కమలాపూర్‌లో పంటల వివరాలు సేకరిస్తున్న అధికారులు

పరిహారం అందించాలి

చేగుంట(తూప్రాన్): అకాల వర్షంతో మండలంలోని పలు గ్రామాల్లో పంటలు నీట మునిగాయి. దీంతో రైతులకు తీవ్ర నష్టం జరిగింది. వర్షాలకు మండలంలోని అన్ని చెరువుల మత్తడులు దూకడంతో పల్లపు ప్రాంతాల్లో ఉన్న వరి పంటలన్నీ కొట్టుకుపోయాయి. మరికొన్ని గ్రామాల్లో పంటలు నీటమునిగాయి. రెడ్డిపల్లి, రుక్మాపూర్, ఇబ్రహీంపూర్, మక్కరాజీపేట, చందాయిపేట గ్రామాల్లో పంటలు దెబ్బతిన్నాయి. అధికారుల అంచనా ప్రకారం 540 ఎకరాల్లో పంటనష్టం జరిగినట్లు నిర్ధారించగా, వెయ్యి ఎకరాల వరకు దెబ్బతిన్నాయని రైతులు వాపోతున్నారు. అధికారులు దెబ్బతిన్న పంటలను గుర్తించి పరిహారం అందించాలని కోరుతున్నారు.


టేక్మాల్(మెదక్): అచ్చన్నపల్లిలో వరిని పరిశీలిస్తున్న అధికారి

వర్షం నీరు నిలువకుండా చూడాలి

టేక్మాల్(మెదక్): వర్షపు నీరు పంట పొలాల్లో నిల్వ లేకుండా చూసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాం ప్రసాద్ తెలిపారు. శనివారం మండలంలోని అచ్చన్నపల్లి గ్రామంలో వరి పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాల కారణంగా పొలాల్లో నీరు చేరడం ద్వారా వేర్లు నలుపు రంగులోకి మారి కుళ్లిపోతాయన్నారు. అధికంగా నీరు చేరితే పంట ఎరుపు రంగులోకి మారుతుందన్నారు. అధిక దిగుబడులు రావాలంటే రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని సూచించారు. పంటలను పరిశీలించిన వారిలో ఏఈఓ ప్రవీణ్ తదితరులు ఉన్నారు.


చేగుంట(తూప్రాన్): మక్కరాజీపేటలో కొట్టుకుపోయిన వరి పొలాన్ని చూపుతున్న మహిళా రైతు కళావతి

మోదుగు ఆకులతో వినాయకుడు

తీర్చిదిద్దిన ఫార్మసీ గ్రాడ్యుయేట్

వర్గల్(గజ్వేల్): పర్యావరణానికి చేటు చేసే ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ గణపతులు వద్దు.. పర్యావరణ హిత గణపతులే మేలు అంటున్నాడు వర్గల్‌కు చెందిన ఫార్మసీ గ్రాడ్యుయేట్ అయ్యగల్ల దయాకర్. ప్రతి యేటా పర్యావరణ హిత గణపతిని తానే తయారు చేసి పూజిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఈసారి మోదుగాకులతో గణపతిని కళాత్మకంగా తీర్చిదిద్దాడు. సంకల్పం ఉంటే సాధ్యం కానిది లేదన్నట్లు నాలుగేళ్ల క్రితం 2021లో మట్టి వినాయకుడిని, 2022లో వినూత్నంగా కాగితాలతో, 2023లో గోనెసంచులతో (గన్నీ బ్యాగ్) గణేశుడిని తయారు చేసి కళాత్మకంగా తీర్చిదిద్దాడు. తన ఇంట్లో ప్రతిష్ఠించుకొని పూజలు చేశాడు. గత సంవత్సరం అమ్మమ్మ మృతితో నవరాత్రోత్సవాలు జరుపుకోలేదు. తాజాగా వినూత్న రీతిలో మోదుగ ఆకులు వినియోగించి 7 అడుగుల గణపతిని తయారు చేశాడు. సమాజంలో మార్పే లక్ష్యంగా పర్యావరణహిత వస్తువులతో వినాయకుడిని తయారుచేస్తూ ప్రచారం చేస్తున్నట్లు దయాకర్ పేర్కొన్నాడు. ఆ యువకుడిని గజ్వేల్ శ్రీరామకోటి భక్త సమాజం వ్యవస్థాపక అధ్యక్షుడు రామకోటి రామ రాజు అభినందిస్తూ జ్ఞాపిక అందజేసి సన్మానించాడు.


ఆకట్టుకుంటున్న గణపతి

కుంటలో పడి వ్యక్తి మృతి

రెస్క్యూ టీం సహాయంతో శవాన్ని బయటకు తీసిన పోలీసులు

చేర్యాల(సిద్దిపేట): ప్రమాదవశాత్తు కుంటలో పడిన వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలోని వేచరేణి గ్రామంలో శనివారం ఉదయం వెలుగు చూసింది. స్థానికులు, కొమురవెల్లి పోలీసుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన ఎగుర్ల సాయిబాబు(30) శుక్రవారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలం వద్దకు వెళ్లాడు. రాత్రి అయినా తిరిగి ఇంటికి రాలేదు. దీంతో పలు చోట్ల వెతికిన కుటుంబ సభ్యులు పొలం దగ్గర నుంచి వచ్చే దారిలో కుంట వద్ద సాయిబాబు బైక్‌ను గుర్తించారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా కొమురవెల్లి ఎస్‌ఐ రాజు, తహసీల్దార్ దిలీప్‌నాయక్ కుంట వద్దకు వెళ్లి రెస్క్యూ టీం సహాయంతో శవాన్ని బయటకు తీశారు. పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వచ్చే క్రమంలో ప్రమాదవశాత్తు దారి పక్కనే ఉన్న కుంటలో పడినట్లు కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. కాగా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ ఘటనా స్థలానికి వచ్చి గాలింపు చర్యలను పరిశీలించారు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.


సాయిబాబు

చికిత్స పొందుతూ యువకుడు..

బెజ్జంకి(సిద్దిపేట): రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ ఘటన మండల పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ సౌజన్య కథనం మేరకు... ముత్తన్నపేట గ్రామానికి చెందిన బొర్ర పర్శరాములు(48), భార్య, ఇద్దరు కుమారులతో కూలీ పని చేస్తూ జీవిస్తున్నాడు. ఈనెల 20న గ్రామం నుంచి మండల కేంద్రానికి బైక్‌పై సరుకుల కోసం వెళ్తుండగా పంది అడ్డు వచ్చి బైక్‌ను ఢీకొంది. దీంతో కిందపడ్డ అతడి తలకు తీవ్ర గాయమైంది. వెంటనే అంబులెన్సులో కరీంనగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఈనెల 23న కరీంనగర్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా ఈ ఘటనపై స్వేరోస్, ఎంఆర్‌పీఎస్, దళిత శక్తి సంఘాల ఆధ్వర్యంలో గ్రామస్తులు బెజ్జంకి గ్రామ పంచాయతీ వద్ద శనివారం నిరసన వ్యక్తం చేశారు.


బొర్ర పర్శరాములు

బహిర్భూమికి వెళ్లి...

కౌడిపల్లి(నర్సాపూర్): బహిర్భూమికి వెళ్లిన యువకుడు నీటిలో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తునికి గ్రామంలో జరిగింది. శనివారం ఎస్‌ఐ రంజిత్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన చాకలి సత్తయ్యకు ఇద్దరు భార్యలు. పెద్దభార్యకు ఇద్దరు కొడుకులు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. చిన్న కొడుకు చాకలి మల్లేశం(28) ఈనెల 28న రాత్రి బహిర్భూమికి వెళుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. ఆరోజు రాత్రి కుటుంబ సభ్యులు పలుచోట్లు వెతికినా అతని ఆచూకీ దొరకలేదు. కాగా శనివారం ఉదయం గ్రామ సమీపంలోని కలీల్‌సాగర్ చెరువులో మల్లేశం మృతదేహం నీటిపై తేలడంతో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు గుర్తించి బయటకు తీశారు. ఇదిలా ఉండగా మృతుని అన్న శ్రీనివాస్ సైతం సుమారు ఆరునెలల క్రితం పశువులు మేపేందుకు వెళ్లి ఫిట్స్ రావడంతో చెరువులో మునిగి చనిపోయాడు. ఆరునెలల్లో అన్నదమ్ములిద్దరూ మృతి చెందడంతో గ్రామంలో విషాదం నెలకొంది.


చాకలి మల్లేశం

హాస్టల్ విద్యార్థిని అదృశ్యం

నారాయణఖేడ్: విద్యార్థిని అదృశ్యమైంది. ఈ ఘటన మండలంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా... నారాయణఖేడ్‌లోని ఎస్సీ కళాశాల బాలికల హాస్టల్‌లో ఉంటూ వడ్డూరి సంధ్య (18) పట్టణంలోని నలంద వొకేషనల్ కళాశాలలో ఎంపీహెచ్‌డబ్ల్యూ చదువుతుంది. ఈనెల 22న కళాశాలకు వెళ్తున్నానని చెప్పి తిరిగి రాలేదు. హాస్టల్ వెల్ఫేర్ అధికారి రజిత పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ విద్యాచరణ్‌రెడ్డి కేసు నమోదు చేశారు.

చికిత్స కోసం వచ్చి..

సంగారెడ్డి క్రైమ్: చికిత్స నిమిత్తం పట్టణానికి వచ్చిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమేశ్ వివరాల ప్రకారం... సదాశివపేట మండలం ఏటిగడ్డ సంగ్యం గ్రామానికి చెందిన మంగు పోచయ్య(48) ఫిట్స్‌తో బాధపడుతున్నాడు. ఈ క్రమంలో చికిత్స కోసం సంగారెడ్డి మండలంలోని ఇర్గిపల్లి గ్రామానికి ఈ నెల 29న ఉదయం 10 గంటల సమయంలో ఇంటి నుంచి గ్రామానికి వెళ్లాడు. తిరిగి ఇంటికి రాలేదు. కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


పోచయ్య

క్రీడాకారులకు సన్మానం


క్రీడాకారులతో డీఈఓ శ్రీనివాస్ రెడ్డి

సిద్దిపేటజోన్: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా జిల్లా నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులను శనివారం ఘనంగా సన్మానించారు. స్థానిక టీటీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో 2024–25 సంవత్సరానికి సంబంధించిన క్రీడాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్ రెడ్డి, స్కూల్ అండ్ గేమ్స్ ఫెడరేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి సౌందర్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలను బలోపేతం చేయాలి

- కౌన్సెలింగ్ ద్వారా సెర్ప్ సిబ్బంది బదిలీ
- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్

సిద్దిపేటరూరల్: సెర్ప్ సిబ్బంది మహిళా సంఘాల బలోపేతానికి బాధ్యతగా పనిచేయాలని కలెక్టర్ గరిమా అగర్వాల్ అన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాలులో రాష్ట్ర గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ సీఈవో ఆదేశాల మేరకు సెర్ప్ సిబ్బందికి కౌన్సెలింగ్ ద్వారా బదిలీలు చేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని సెర్ప్ సిబ్బందిని ఎల్ -2, ఎల్ -1, ఎంఎస్ సీసీఎస్ 115 మంది ఉద్యోగులను బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో దాదాపు అన్ని మహిళా సంఘాలకు స్టీల్ బ్యాంక్ అందించామన్నారు. ప్రతి మహిళా సంఘం ఒక రిజిస్టర్ పెట్టి ఎక్కడ ఏ ఏ కార్యక్రమాల్లో ఉపయోగించారు? ఎంత ఆదాయం వచ్చింది? అనే విషయాలు నమోదు చేసుకోవాలన్నారు. క్లస్టర్ల వారీగా ప్రజలకు డ్రై డేపై, నీటి నిల్వతో దోమల లార్వా పెరిగి, వచ్చే వ్యాధులపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ జయదేవ్ ఆర్య, అదనపు డీఆర్డీఓ సుధీర్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అదనపు కలెక్టర్

డెయిరీ ఫామ్‌పై పోలీసుల దాడి

210 కిలోల కల్తీ నెయ్యి స్వాధీనం

హత్నూర(సంగారెడ్డి): కల్తీ నెయ్యి తయారు చేస్తున్నారన్న అనుమానంతో సీసీఎస్ పోలీసులు దాడి చేసి సుమారు 210కేజీలను స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం... మండలంలోని గోవిందరాజు పల్లి గ్రామ శివారులోని మధుప్రియ డెయిరీ ఫామ్‌పై పోలీసులు శనివారం దాడి చేశారు. 10 కేజీల నెయ్యి బకెట్లు 16, 30 లీటర్ల పెద్ద క్యాన్లు రెండు, కాటన్ మంచి నూనె ప్యాకెట్లు, కార్న్‌ఫ్లోర్ పౌడర్, టెస్టింగ్ సాల్ట్ ప్యాకెట్, మిల్క్ పౌడర్, బేకింగ్ సోడా, ఇతర కెమికల్ వస్తువులను స్వాధీనం చేసుకుని పోలీసులకు అప్పగించారు. డెయిరీ నిర్వాహకుడితోపాటు ఆటో, కల్తీ నెయ్యిగా భావిస్తున్న డబ్బాలను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ విషయమై ఎస్సై శ్రీధర్ రెడ్డిని సంప్రదించగా స్వాధీనం చేసుకున్న వాటిని స్టేషన్‌లో ఉంచామని ఫుడ్ ఇన్‌స్పెక్టర్ వచ్చిన తర్వాత ఫిర్యాదు తీసుకొని కేసు నమోదు చేస్తామని తెలిపారు. కాగా గతంలో కూడా ఈ డెయిరీపై కల్తీ పాలు తయారు చేస్తున్నారని కేసు నమోదు చేశారు.


కల్తీ నెయ్యిగా అనుమానిస్తున్న డబ్బాలను ఆటోను స్వాధీనం చేసుకున్న పోలీసులు

వర్షానికి తెగిపోయిన రోడ్లు

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

దుబ్బాకరూరల్: ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రోడ్లన్నీ తెగిపోయాయి. కామారెడ్డి జిల్లాకు వెళ్లాలంటే బీబీపేట వద్ద రోడ్డు కోతకు గురైంది. అలాగే నర్మాల నుంచి వెళ్లాలంటే మానేరు వాగు పొంగి పొర్లడంతో రోడ్డుపై నుంచి నీటి ప్రవాహం ఎక్కువగా పోతోంది. మెదక్ జిల్లాకు వెళ్లాలంటే నిజాంపేట వద్ద రోడ్డు తెగింది. కామారెడ్డి జిల్లాను సరిహద్దును కలిపే మండలంలోని ఆకారం వాగు బ్రిడ్జిపై నుంచి నీళ్ల ఎక్కువగా పోవడంతో రాకపోకలు నిలిచి పోయాయి. ఇలా ఎటూ చూసినా వీలు లేకుండా పోయింది. ఎక్కడి వారు అక్కడే తమ బంధువుల ఇండ్లల్లోనే ఉండి పోయారు. ఒక వేళ కామారెడ్డికి వెళ్లాలంటే కరీంనగర్ మీదుగా 160 కిలో మీటర్ల దూరం అవుతుంది. ఇంతకు ముందుకు 35 కిలో మీటర్లు ఉండేది. మూడు రోజులుగా ఊర్లకు వెళ్లేందుకు ఇబ్బందులకు గురవుతున్నారు.


ఆకారం బ్రిడ్జిపై నుంచి వెళుతున్న నీటి ప్రవాహం

అటవీ భూమి ఆక్రమణ

అడ్డుకున్న అధికారులు.. వాహనాల స్వాధీనం

శివ్వంపేట(నర్సాపూర్): అటవీ భూమిని కబ్జా చేసేందుకు చదును చేస్తుండగా అధికారులు అడ్డుకున్నారు. ఈ ఘటన మండల పరిధిలోని పిల్లుట్లలో శనివారం చోటు చేసుకుంది. పిల్లుట్ల కంపార పరిధిలో శనివారం పలువురు వ్యక్తులు డోజర్లు, జేసీబీలతో అటవీ భూమిని చదును చేస్తున్నారు. విషయం తెలుసుకున్న అటవీ శాఖ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని 4 డోజర్లు, 2 జేసీబీలను స్వాధీనం చేసుకుని నర్సాపూర్ అటవీ కార్యాలయానికి తరలించారు. కేసులు నమోదు చేసి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని డిప్యూటీ రేంజ్ అధికారి సిద్దిరాంసింగ్ తెలిపారు. సెక్షన్ అధికారులు శ్రీధర్ బాబు, రాజమణి, సాయిరాం, బీట్ ఆఫీసర్లు కుమార్, వెంకటేశ్ ఉన్నారు.


స్వాధీనం చేసుకున్న డోజర్లు, జేసీబీలు